క్లుప్తంగా

కౌలు కార్డులతో రైతులకు ప్రయోజనం



డి.వనిపెంటలో కౌలు రైతులకు సూచనలిస్తున్న ఏఓ రంగనేతాజి

చాగలమర్రి: కౌలు కార్డుతో ప్రయోజనం ఉంటుందని, అర్హులు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి రంగనేతాజి అన్నారు. మండలంలోని గోడిగనూరు, డి.వనిపెంట గ్రామాల్లో పంట సాగు హక్కు, కౌలు కార్డుపై బుధవారం కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ కౌలు కార్డు ఉంటే బ్యాంకు ద్వారా పంట రుణం పొంద వచ్చన్నారు. పంట సాగు హక్కు పత్రాల కొరకు స్థానిక గ్రామాల్లో వీఆర్‌ఓను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కౌలు రౌతులు, వ్యవసాయ సహాయకులు, ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



నల్లవాగుపల్లెలో బండనులాగుతున్న వృషభరాజములు

రుద్రవరం: మండల పరిధిలోని నల్లవాగుపల్లెలో ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. మారెమ్మ అమ్మవారి జాతర సందర్భంగా బుధవారం గ్రామ పెద్దలు న్యూకేటగిరి వృషభ రాజములకు బండ లాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల వృషభాలు పాల్గొన్నాయి. అలాగే గాడిదలకు ఇసక బస్తాల మోత పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన వాటి యజమానులకు గ్రామ పెద్దలు నగదు బహుమతులు అందజేశారు.

కొత్తపల్లెలో దేవత విగ్రహాల ప్రతిష్ఠోత్సవం



వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామంలో బుధవారం దేవతా విగ్రహాలను అత్యంత వైభవంగా ప్రతిష్ఠించారు. గ్రామ ప్రజల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొదట వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణం, రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, పాత చెన్నకేశవస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, గరుత్మంతుడి విగ్రహం ఏర్పాటు, లక్ష్మీచెన్నకేశవ ఆలయంలో మరకతలింగం ప్రతిష్ఠతో పాటు గ్రామ ముందర అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలతో మహోత్సవం పూర్తయింది. ఉత్సవాల్లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డి, దస్తగిరిరెడ్డి, తులసిరెడ్డి, శివనాగిరెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి

- డీఎం అండ్ హెచ్‌ఓ వెంకటరమణ

బండి ఆత్మకూరు: సమయ పాలన పాటించాలని డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి సూచించారు. బుధవారం బి.కోడూరు గ్రామంలో జరుగుతున్న 104 వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటుచేసిన మందులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ పీహెచ్‌సీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. డాక్టర్ భావన రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సలహాలు పాటించండి

బండి ఆత్మకూరు: వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నంద్యాల వ్యవసాయ శాఖ ఏడీ రాజశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ముందస్తుగా వరి నాట్లు వేసుకునేలా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండలానికి కేటాయించిన మట్టి నమూనాలను త్వరితగతిన సేకరించి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. గ్రామాల్లో పొలం లేని రైతులు, కౌలుకు తీసుకున్న రైతులను గుర్తించి కౌలు కార్డుల ద్వారా కలిగే లాభాలను వివరించాలన్నారు. అర్హులైన కౌలు రైతులు స్థానిక వీఆర్వో వద్ద కౌలు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అబ్బీపురంలో పదహారు రోజుల పండుగ

మహానంది: అబ్బీపురం గ్రామంలో గత నెల 29, 30వ తేదీల్లో పెద్దమ్మ దేవర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం పదహారు రోజుల పండుగ వైభవంగా చేపట్టారు. మహిళలు వారి ఇళ్ల వద్ద నుంచి బోనాలు తీసుకొచ్చి పెద్దమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణం వద్ద గ్రామ ప్రజలకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

గండ్లు పూడ్చరు.. నీరు పారదు!

- అస్తవ్యస్తంగా తెలుగుగంగ మెయిన్, ఉప ప్రధాన కాల్వల నిర్వహణ
- పలుచోట్ల గండ్లు..చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వం
- ఆందోళనలో రైతులు



అప్పనపల్లె సమీపంలో ప్రధాన కాల్వలో పడ్డ భారీ గండి



కోటకొండ వద్ద ప్రధాన కాల్వకట్ట గండిలో నుంచి వృథాగా పోతున్న నీరు

రుద్రవరం: కూటమి ప్రభుత్వం సాగునీటి కాల్వల మరమ్మతులపై దృష్టి సారించడం లేదు. దీంతో రైతులు రానున్న ఖరీఫ్‌లో పంటలు ఎలా పండించుకోవాలని ఆందోళన చెందుతున్నారు. ఆళ్లగడ్డ నియోజక వర్గంలో శిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల పరిధిలోని ప్రజలకు, రైతులకు తాగు,సాగు నీరు అందించే ప్రధాన వనరు తెలుగుగంగ కాల్వ. దాదాపు 30 వేల ఎకరాలకు నీరందించే ఈ కాల్వ నిర్వహణ ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారింది. పలు చోట్ల గండ్లు పడి మధ్యలోనే నీరు వృథాగా పోతుంది.దీంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది.

పెరిగిన నీటి ఉధృతి..తెగిన కాల్వ కట్టలు

ఎప్పుడూ ఈ ప్రాంతంలో ప్రవహించే తెలుగుంగ కాల్వలో 1500 నుంచి 2000 క్యూసెక్కుల వరకు నీరు వదులుతారు. అయితే, గతేడాది ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకుండా వెలుగోడు రిజ్వర్వాయర్ నుంచి నీటిని భారీగా విడుదల చేశారు. కాల్వల దుస్థితిని పరిగణనలోకి తీసుకోకుండా అధికారులు ఏకంగా 4 వేల క్యూసెక్కుల నీటిని వదలడంతో ప్రధాన,ఉప ప్రధాన కాల్వలకు పలు చోట్ల గండ్లు పడ్డాయి. అలాగే కాల్వల కట్టలు కోతకు గురయ్యాయి. అప్పనపల్లె సమీపంలోని 19వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వకు ఒకే ప్రదేశంలో రెండు మార్లు పెద్ద గండి పడింది. అప్పట్లో ఆ కాల్వ పరిధిలోని ఆయకట్టు రైతులు గండిని పూడ్చాలని తెలుగుగంగ అధికారులను బతిమలాడినా పట్టించుకోలేదు. అలాగే శ్రీరంగాపురం వద్ద 17వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వలో మూడు చోట్ల గండ్లు పడ్డాయి. వాటిని పూడ్చలేదు. పైగా మీరే గండ్లను పూడ్చుకోవాలని రైతులకు అధికారులు ఉచిత సలహా ఇచ్చారు. దీంతో చేసేదిలేక కొందరు రైతులు పంటలను కాపాడుకునేందుకు అప్పనపల్లె, శ్రీరంగాపురం వద్ద పడ్డ గండ్లను పూడ్చు కున్నారు. ఇంతవరకు అందుకు అయిన బిల్లును సర్కారు ఇవ్వలేదు. అలాగే కోటకొండ సమీపంలో ప్రధాన కాల్వ కట్టకు ఓ గండి, అప్పనపల్లె సమీపంలో ప్రధాన కాల్వ మధ్యలో మరో గండి పడి ఉన్నాయి.ఇలా ఎక్కడ పడితే అక్కడ గండ్లు పడి నీరు దిగువకు పారకుండా ఆటంకంగా మారాయి. మరో పదిహేను రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఆలోపు గండ్లు పూడ్చకపోతే తమ పొలాలకు సాగునీరు అందక పంటలు పండక ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.



శ్రీరంగాపురం వద్ద గండిని పూడ్చుకున్న రైతులు (ఫైల్)



శ్రీరంగాపురం వద్ద ఉప ప్రధాన కాల్వకు గండి

గండి పూడ్చిన సొమ్ము నేటికీ అందలేదు



గత ఖరీఫ్ సీజన్‌లో కాల్వలో నీటి ప్రవాహం అధికం కావడంతో శ్రీరంగాపురం సమీపంలో 17వ బ్లాక్ కాల్వకు భారీ గండి పడింది. అప్పట్లో అధికారుల దృష్టికి తీసుకెళ్తే ప్రభుత్వం వద్ద నిధులు లేవని వేసవిలో మరమ్మత్తులు చేయిస్తామన్నారు. లేదంటే మీరే గండిని పూడ్చుకోండి బిల్లు వచ్చినప్పుడు ఆ సొమ్ము మీకే ఇస్తామని చెప్పడంతో నమ్మి రైతులమంతా కలిసి గండిని పూడ్చుకున్నాము. ఇంతవరకు ఆ సొమ్ము ఇవ్వలేదు.

–మధు, రైతు, శ్రీరంగాపురం

మల్లన్న సేవలో జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి



మల్లన్న దర్శనానికి వెళ్తున్న జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి జి.శ్రీనివాస్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి జి.శ్రీనివాస్(ఐఏఎస్) దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. బుధవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి జి.శ్రీనివాస్‌కు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద ఆశీర్వచన మండపంలో జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శికి వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

గజేంద్ర వాహనంపై పాండురంగడు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత పాండురంగ విఠలేశ్వరుడు బుధవారం గజేంద్ర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవరోజు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు మహాగణపతి పూజ, పంచామృతాభిషేకం, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, సంప్రోక్షణ, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి స్వామి వాహన సేవల్లో చివరిదైన గజేంద్ర వాహనంపై కొలువుదీరి పూజలందుకున్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జిల్లా స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన మన్వీంత్‌నాయక్, శివకార్తికేయ, రిషితబాయి, సాయితేజస్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నంద్యాల జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, అధ్యక్షుడు రవికృష్ణ, జిల్లా క్రీడాధికారి నరసింహరాజు పేర్కొన్నారు. బుధవారం రామకృష్ణ విద్యాలయంలో జిల్లా స్థాయి చెస్ పోటీల విజేతలకు బహుమతుల ప్రధానం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 24, 25 తేదీల్లో నర్సరావుపేటలో జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంటు మునిశేఖర్, క్రీడా భారతి కార్యదర్శి సుధాకర్, ఆర్బిటర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో కార్పొరేట్ సంస్థలకు లబ్ధి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్

నంద్యాల(న్యూటౌన్): ప్రధాని నరేంద్రమోదీ పాలనలో పేదలకు ఒరిగిందేమీ లేదని కార్పొరేట్ సంస్థలకు మాత్రమే లబ్ధి చేకూరుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. కేంద్రం అమలు చేస్తున్న ఆర్థిక విధానాలతో ప్రజలు విసుగు చెందారన్నారు. బుధవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకుడు ఏసురత్నం అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికాలో ట్రంప్ అధికారంలోకి వచ్చాక ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాద్యం ఏర్పడిందన్నారు. ప్రతి దేశంపై ఆయన సుంకాలను విధిస్తూ తన ఆధిపత్యాన్ని నింపుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మనదేశంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలతో దేశంలో పేదరికం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, సభ్యులు నాగరాజు, నాగేశ్వరరావు, నరసింహనాయక్, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి రూ. 3.60 కోట్లు



పెద్దయమ్మనూరు, ఇంజేడు గ్రామాల మధ్యలో నిర్మిస్తున్న కల్వర్టు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్‌అండ్‌బీ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 3.60 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ఆ డిపార్ట్‌మెంట్ డీఈ సునీల్‌రెడ్డి బుధవారం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె రహదారిలో 17వ కిలో మీటర్ నుంచి 26వ కిలో మీటర్ వరకు తారురోడ్డు నిర్మాణం కోసం (రెన్యువల్) రూ. 2 కోట్లు, నాబార్డు ఆర్థిక సహాయంతో, అలాగే ఉయ్యాలవాడ నుంచి సుద్దమల్ల రోడ్డుకు రెన్యువల్ రూ. 1 కోటి ఎండీఆర్ నిధులు మంజూరయ్యాయన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె రహదారిలో ఇంజేడు, పెద్దయమ్మనూరు గ్రామాల మధ్య భూమికి వంతెన సమాంతరంగా ఉండడంతో వర్షాకాలంలో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు.. దీంతో హైలెవెల్ కల్వర్టు నిర్మాణం కోసం రూ. 60 లక్షలు కేటాయించడంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణం పనులు ప్రారంభించారని డీఈ స్పష్టం చేశారు.

భూములు కాపాడుకోవటం తెలియదా

- తంగడంచ ఫారం అధికారులపై ఆత్మకూరు ఆర్డీఓ ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ నాగజ్యోతి

జూపాడుబంగ్లా: తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రంలో విధులు నిర్వహిస్తే సరిపోదు భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడుకోవాలని ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి ఫారం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫారం అధికారుల ఫిర్యాదు మేరకు ఆక్రమణకు గురైన ఫారం భూములను బుధవారం ఆర్డీఓ పరిశీలించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ, ఫారం ఏఓలతో సమావేశం నిర్వహించి ఆక్రమణకు గురైన ఫారం భూముల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె ఆక్రమణలను స్వయంగా పరిశీలించారు. కర్నూలు–గుంటూరు రహదారి వెంట క్వార్టర్స్ నుంచి జూపాడుబంగ్లా వరకు ఆక్రమించుకుని ఏర్పాటుచేసుకున్న షెడ్లను అధికారులు ఆర్డీఓకు చూపించారు. ఆలయ నిర్మాణం కోసం ఏర్పాటుచేసిన శ్రీకృష్ణుని విగ్రహాన్ని, ముస్లింలు నిర్మించుకున్న మసీదును, ఎస్సీలు కమ్యూనిటీ హాలు కోసం ఏర్పాటుచేసిన బోర్డును ఫారం ఏఓలు కిశోర్, తేజశ్వరీదేవి, నిర్మల ఆర్డీఓకు చూపించారు. పోలీసుల సహకారంతో ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్, ఎంపీడీఓలను ఆర్డీఓ ఆదేశించారు. ముస్లింలను పిలిపించి ఫారం భూముల్లోంచి మసీదు నిర్మాణాన్ని తొలగించాలని ఆదేశించారు. షాదీఖాన కోసం కేటాయించిన 28 సెంట్ల స్థలంలో మసీదు నిర్మించుకోవాలని సూచించారు. అనంరతం ఆర్డీఓ నాగజ్యోతి మాట్లాడుతూ అనుమతుల్లేకుండా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆమె వెంట డీటీ సత్యదీప్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అతిసారంపై అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: తాగునీటి కలుషితం వల్ల అతిసారం ప్రబలే అవకాశం ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని గోస్పాడు వైద్యాధికారి డాక్టర్ గోపాల్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, ఆరోగ్య విషయాలపై ఎప్పటికప్పుడు వారికి అవగాహన కల్పించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నాయని ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో వాంతులు, విరేచనాలు ఉన్న వారిని గుర్తించి వారికి వెంటనే ఓఆర్ఎస్ ద్రావణం, జింకు మాత్రలు అందించాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల్లో తప్పని సరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింకు మాత్రలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ ఫలితాల్లో ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్షల ఫలితాలు బుధవారం విడుదల అయ్యాయి. నంద్యాల పాలిటెక్నిక్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసప్రసాద్ పరీక్ష ఫలితాల వివరాలను వెల్లడించారు. జిల్లా విద్యార్థులు ఉత్తమ మార్కులతో సత్తా చాటారు. గత నెల 30వ తేదిన 21 సెంటర్లలో 5,120 విద్యార్థులు పరీక్షలు రాశారు. విడుదలైన ఫలితాల్లో సాత్విక్ 119 మార్కులు సాధించి జిల్లాలో 43వ ర్యాంకు, నీలాకృష్ణ 118 మార్కులు సాధించి 92వ ర్యాంకు, వర్షితబాయి 117 మార్కులు సాధించి 176వ ర్యాంకులు తెచ్చుకున్నారు. పాలిసెట్ పరీక్షల్లో బాలురు 93.7 శాతం, బాలికలు 96.62 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు.

కోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటాం

పాములపాడు: నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా భూ సేకరణ ఇష్టారీతిన చేసిన విషయంపై కోర్టు తీర్పునకు కట్టుబడి ఉంటామని జెరూషలేం శాల ఇన్‌చార్జ్‌లు యాకోబు, అజయ్‌వర్మ అన్నారు. బుధవారం మండలంలోని రుద్రవరం గ్రామ సమీపంలోని జెరూషలేం శాల వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్‌హెచ్ నిర్మాణం కోసం 2018లో ప్రార్థనా మందిరం ఉన్న స్థలం 448ఎతో పాటు 448బీ సర్వే నెంబర్‌లో భూ సేకరణ చేస్తున్నట్లు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. అయితే ఇప్పుడు కేవలం 448ఎ సర్వే నెంబరులో మాత్రమే భూ సేకరణ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లతో పాటు క్షేత్ర స్థాయి అధికారులను అడిగినా ఎలాంటి సమాధానం ఇవ్వకపోగా, తమకు నోటీసులు ఇవ్వకుండా ప్రహరీని కూల్చారని వాపోయారు. న్యాయస్థానం పట్ల గౌరవం ఉందని, నేషనల్ హైవే నిర్మాణానికి వ్యతిరేకం కాదన్నారు. చర్చిని కూల్చడానికి అధికారులు, పోలీసులు ఎందుకు అంత చొరవ చూపుతున్నారో అర్థం కావడం లేదన్నారు.

పోలవరంపై ఉన్న శ్రద్ధ శ్రీశైలం ప్రాజెక్ట్‌పై లేదు

మహానంది: రాష్ట్రప్రభుత్వానికి పోలవరంపై ఉన్న శ్రద్ధ.. శ్రీశైలం ప్రాజెక్ట్‌పై లేదని రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ఆరోపించారు. సిద్ధేశ్వరం అలుగు శంకుస్థాపన వార్షికోత్సవం సందర్భంగా ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం మహానంది మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ 2009లో వచ్చిన వరదలకు శ్రీశైలం ప్రాజెక్ట్ ప్లంజ్ పూల్ దెబ్బతిందన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌కు వెలుగులు పంచిన శ్రీశైలం ప్రాజెక్ట్ భద్రతను పట్టించుకోకుండా గాలికి వదిలేశారని విమర్శించారు. ఇప్పటికైనా రెండు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి స్పందించి యుద్ధ ప్రాతిపదికన భద్రతా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివిధ గ్రామాల్లో పర్యటించి ప్రజా బహిరంగ సభకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, నాగేశ్వరరెడ్డి, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

హోంగార్డుల సంక్షేమానికి ప్రాధాన్యత



ప్రతిభ కనబరిచిన హోంగార్డుకు ప్రశంసా పత్రం అందిస్తున్న కమాండెంట్ మహేష్ కుమార్

బొమ్మలసత్రం: హోంగార్డుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కమాండెంట్ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం హోంగార్డ్ యూనిట్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా హోంగార్డుల కవాతును పరిశీలించారు. ఈసందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ట్రాఫిక్ పర్యవేక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, విపత్తులు సంభవించినప్పుడు హోంగార్డుల సేవలు ఎంతో ఉపయోగకరమన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించకుండా క్రమశిక్షణతో సిబ్బంది మెలగాలన్నారు. హోంగార్డులకు వ్యక్తిగత ప్రమాదబీమా పాలసీకి రూ.3.5 లక్షల కేటాయించామన్నారు. అనంతరం కవాతు, విధినిర్వహణలో ప్రతిభకనపరిచిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో కమాండెంట్‌తో పాటు హోంగార్డ్ డీఎస్పీ ప్రసాద్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్, సురేష్‌బాబు, ఆర్ఎస్ఐ ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల భూముల వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

ఉయ్యాలవాడ : స్థానిక అగస్తీశ్వర, కోదండ రామస్వామి ఆలయ భూములు ఏడాది కౌలు సాగు కోసం బుధవారం అగస్తీశ్వర స్వామి ఆలయంలో దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి చంద్రుడు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు.ఈ ఆలయాలకు సంబంధించి 51.25 ఎకరాలకు గ్రామంతో పాటు వివిధ గ్రామాల రైతులు పాల్గొని రూ. 2,30,500కు వేలం పాట పాడి దక్కించుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే కౌలు వేలం ద్వారా రూ. 8,500 ఆదాయం పెరిగిందని ఈఓ స్పష్టం చేశారు. మార్కెట్‌లో దిగుబడులకు గిట్టుబాటు ధరలు లేక పోవడంతో కౌలు భూములు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. కార్యక్రమంలో బనగానపల్లె డివిజన్ దేవదాయ ఇన్‌స్పెక్టర్ గోపి, వైఎస్ఆర్‌సీపీ, టీడీపీ మండల కన్వీనర్లు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఆలయాల మాజీ ధర్మకర్తలు పోచా రాధాకృష్ణారెడ్డి, ముసాని శివరామిరెడ్డి, సాగు నీటి సంఘం చైర్మన్ ఆకుల చిన్న వెంకటసుబ్బయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): నయా పాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం నంద్యాల పట్టణంలోని గాంధీచౌక్‌లో ఉన్న హమాలీ యూనియన్ కార్యాలయంలో పాసిజం విధానం అనే అంశంపై కార్మిక కర్షకులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా విధానాలు రూపొందిస్తుందన్నారు. పెట్టుబడి దారులకు, కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా మోదీ పాలన సాగుతుందన్నారు. 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లకు కుదింపు చేయడం అందులో భాగమన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేని పరిస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలున్నాయన్నారు. ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు ప్రతి ఒక్కరు సంఘీభావం తెలపాలన్నారు. సమావేశంలో సీపీఎం కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు నాగరాజు, తోటమద్దులు, పుల్లా నరసింహులు, వెంకటలింగం, జైలాన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్‌లో పడి వ్యక్తి మృతి

మహానంది: మొక్కలకు నీళ్లు పడుతూ ప్రమాదవశాత్తూ స్విమ్మింగ్ పూల్‌లో పడి గాజులపల్లెకు చెందిన మంటునూనె మహ్మద్ కాశీం(47) బుధవారం మృతిచెందాడు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మహ్మద్ కాశీం భార్య రహమ్మద్‌బీతో కలిసి బుక్కాపురం సమీపంలోని నంది ఫామ్ హౌస్‌లో మొక్కలకు నీళ్లు పట్టే పనిలో చేరారు. చెట్లకు నీళ్లు పోసే క్రమంలో కాశీం స్విమ్మింగ్ పూల్‌లో పడ్డాడు. అదే సమయంలో మూర్ఛ వ్యాధి రావడంతో బయటకు రాలేక మృతిచెందాడు. సూపర్‌వైజర్ వెంకటరెడ్డి గుర్తించి మృతుడి భార్యకు సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ.. తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.





రహదారి పక్కన మట్టి చెదిరిపోయి ప్రమాదకరంగా మారిన దృశ్యం, రక్షణ గోడ లేని వంతెన

మాటు వేసిన ప్రమాదం

గోస్పాడు: పసురపాడు–తేళ్లపురి వైపు వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. రహదారి ఇరుకిరుకుగా ఉండటం..రోడ్డుకిరువైపులా వేసిన మట్టి చెదిరిపోవడంతో వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం బారిన పడాల్సి వస్తుంది. ఈ రోడ్డుపై వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. రెండు భారీ వాహనాలు ఎదురైతే పక్కకు వెళ్లేందుకు స్థలం ఉండదు. రోడ్డు పక్కనే పంటపొలాలు ఉండటంతో వాటికి నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన కాల్వలున్నాయి. రాత్రి సమయాల్లో కొందరు వాహనదారులు గమనించకుండా వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంటే కనీసం వంతెనలు, మలుపులు, గుంతలున్న చోట ప్రమాద సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.